ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

బుధవారం 26 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సెహరీ (గురువారం ఉదయం)
కడప	6.31	5.01
ప్రొద్దుటూరు	6.32	5.05







గరం గరం.. రాజకీయం



జిల్లాలో ఓ పక్క సూరీడు నిప్పులు గక్కుతున్నాడు. భానుడి భగభగలకు దీటుగా కడప రాజకీయాలు కూడా గరం గరంగా మారాయి. జడ్పీ చైర్మన్ ఎన్నిక ఈ నెల 27వ తేదీన జరగనుంది. జడ్పీటీసీ సభ్యులు చేజారకుండా ఉండేందుకు వైసీపీ క్యాంపు రాజకీయం నిర్వహిస్తోంది. ఇంతలోనే కడప మేయరు కొత్తమద్ది సురేశ్‌బాబుకు జీహెచ్‌ఎంసీ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించారని, మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో 15 రోజుల్లో లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని లేదంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం నుంచి నోటీసులు అందాయి. అయితే తనకు నోటీసు అందలేదని, నోటీసులు వచ్చిన తరువాత అధికార పార్టీ నేతల అవినీతిపై బాంబు పేలుస్తానంటూ సురేశ్‌బాబు చేసిన వ్యాఖ్యలు కడప పాలిటిక్స్‌లో మరింత ఆసక్తిని పెంచాయి.

- మేయర్ సురేశ్‌బాబుకు బిగుస్తున్న ఉచ్చు
- అనర్హత వేటు ఎందుకు వేయకూడదంటూ షోకాజ్ నోటీసు
- త్వరలోనే టీడీపీ నేతల అవినీతిపై బాంబు పేలుస్తామన్న మేయర్

(కడప-ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లో కుర్చీ కోసమై ఎమ్మెల్యే ఆర్.మాధవి, మేయర్ ససురేశ్‌బాబు మధ్య గొడవ సాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో మేయర్‌ుకు నోటీసులు రావడం.. అదే సమయంలో అధికార పార్టీ నేతల అవినీతి బాంబు పేలుస్తానని సురేశ్‌బాబు వ్యాఖ్యలు చేయడం పొలిటికల్ హీట్‌ను తారాస్థాయికి తీసుకెళ్లింది. నిబంధల మేరకు మేయర్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత వారి కుటుంబ సభ్యులెవరూ కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి కాంట్రాక్టు పనులు చేయకూడదు. అలా చేసినట్లు రుజువైతే ఎన్నికైన సభ్యులు డిస్‌క్వాలిఫై అవుతారని నిబంధనల్లో ఉంది. మేయర్ సురేశ్‌బాబు 30 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నారు. పదేళ్లుగా కడప మేయర్‌గా పనిచేస్తున్నారు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉండటంతో వారికి నిబంధనలు, చట్టాలు తెలుసు. అయినా స్వప్రయోజనాల కోసం ఉద్దేశ్యపూర్వకంగా చట్టాలు ఉల్లంఘించారని విజిలెన్స్ ఆరోపించింది. నిబంధనలను ఉల్లంఘించి కుటుంబ సభ్యులతో కాంట్రాక్టు పనులు చేపట్టడంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో.. 15రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయాలంటూ మేయర్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ సోమవారం మెమో నెం.2748808/జీ/2025 జారీ చేసింది.

వర్ధిని కన్‌స్ట్రక్షన్ పేరుతో..

మేయర్ సురేశ్‌బాబు సతీమణి పేరుతో ఉన్న వర్ధిని కన్‌స్ట్రక్షన్ ద్వారా కార్పొరేషను పరిధిలో 12వ డివిజనులోని ఫక్కీరుపల్లెలో డోరు నెం.36/323-5-4 నుంచి 36/323-7-5 వరకు లక్ష రూపాయలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అదే డివిజనులో రూ.10లక్షలతో సంజన్న సర్కిల్ నుంచి వర్క్షాప్ కాంపౌండు గోడకు రివిట్‌మెంటు, సీసీ అప్రోచ్ పనులు చేశారు. శ్రీనగర్‌కాలనీలో రోడ్డు 2లో 12వ డివిజను వద్ద డోరు నెం.36/323-75 నుంచి 36/123-21-1-12 వరకు రూ.3.25లక్షలతో సిమెంటు రోడ్డు, బైపాస్‌లో రూ.3.90లక్షలతో పనులు చేపట్టారు. ఎకో పార్కు సమీపంలో రూ.4.96లక్షలతో మేజరు వాటర్‌స్టోన్ డ్రైన్, కేఎస్‌నగర్ నుంచి నానాపల్లె వరకు రూ.4.92 లక్షలతో వాటర్‌స్టోన్‌లు, డ్రైన్, విశ్వేశ్వరయ్యసర్కిల్ నుంచి పటేల్‌రోడ్డు, రాజీవ్‌మార్గ్ రోడ్డులో, ఎస్‌బీఐ, హిమాలయా హాస్పిటల్ వరకు వాటర్‌స్టోన్ డ్రైన్, రూ.2.15లక్షలతో మాచుపల్లె బస్టాండు వద్ద పైపులైను ఇంటర్ కనెక్షన్ పనులు చేపట్టారు. 18/115 నుంచి 18/324 వరకు పనులు చేపట్టారు. ఇక 4వ డివిజనులో చర్చి నుంచి బుడ్డాయపల్లె వరకు రూ.9.9లక్షలతో ప్యాచ్ వర్క్ పనులు, బుడ్డాయపల్లె సచివాలయ పరిధిలో రూ.9.9లక్షలతో పనులు అగ్రిమెంటు చేసుకున్నారు.

ఎమ్మెల్యే ఫిర్యాదుతో..

వర్ధిని కన్‌స్ట్రక్షన్ ద్వారా చేపట్టిన పనులన్నింటిపై కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు బృందం కార్పొరేషనులో విచారణ చేపట్టింది. వర్ధిని కన్‌స్ట్రక్షన్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించింది. ఇది మేయర్ సతీమణి జయశ్రీ, వారి కుమారుడు అమరేశ్ పేరిట నమోదైంది. మేయర్ హయాంలో ఈ సంస్థ చేపట్టిన పనులు, పూర్తి చేసిన పనులు పరిశీలించారు. పనుల అగ్రిమెంట్లు పరిశీలించారు. పూర్తయిన పనులకు రూ.33.65లక్షలు చెల్లింపులు చేశారు. జీహెచ్‌ఎంసీ యాక్ట్ నిబధనలకు విరుద్ధంగా పనులు చేసినట్లు విజిలెన్స్ గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపింది. దీంతో 'నిబంధనలు ఉల్లంఘించి కుటుంబ సభ్యులతో పనులు చేపట్టారు. మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు.. మీపై వచ్చిన ఆరోపణలపై 15రోజుల్లోగా ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలి. గడువులోపు వివరణ ఇవ్వకపోతే జీహెచ్‌ఎంసీ చట్టం 1955లోని నిబంధనలు మరియు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం' అని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు.

అనర్హత వేటు పడితే..

కడప కార్పొరేషన్ పాలకవర్గం 18 మార్చి 2021న కొలువుదీరింది. వచ్చే ఏడాది మార్చి 17వ తేదీతో ఈ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తుంది. మేయర్ సురేశ్‌బాబుపై అనర్హత వేటు పడితే 41వ డివిజను కార్పొరేటరు డిప్యూటీ మేయరు-1 ముంతాజ్ బేగంకు పదవి లభిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం కడప కార్పొరేషనులో డిప్యూటీ మేయర్లుగా ముంతాజ్ బేగం, బండి నిత్యానందరెడ్డి ఉన్నారు.

నాకు నోటీసులు అందలేదు

కార్పొరేషను సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాధవీకి కుర్చీ వేయలేదని రాజకీయ కక్షతో ఇదంతా చేస్తున్నారు. నాకు ఎలాంటి నోటీసు అందలేదు. కానీ అందినట్లు టీడీపీ నేతలు చెబుతున్నారు. ఇదంతా కుట్రలో భాగమే. నోటీసులు అందితే అప్పుడు సమాధానమిస్తాం.

- మేయరు సురేశ్‌బాబు

జడ్పీ చైర్మన్ ఎన్నిక ఆపండి

- హైకోర్టును ఆశ్రయించిన టీడీపీ జడ్పీటీసీ సభ్యుడు

కడప రూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ఎన్నిక ఆపాలంటూ గోపవరం మండల టీడీపీ జడ్పీటీసీ సభ్యుడు జయరామిరెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. జిల్లాలో పులివెందుల, ఒంటిమిట్ట మండలాల జడ్పీటీసీ స్థానాలు కొంతకాలంగా ఖాళీగా ఉన్నాయని వాటికి ఎన్నికలు నిర్వహించిన తరువాత జడ్పీ చైర్మన్ ఎన్నికను జరపాలని మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ బుధవారం హియరింగ్‌కు రానుంది. దీనిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుని ఒకవేళ స్టే ఇస్తే 27వ తేదీ జరగాల్సిన జడ్పీ చైర్మన్ ఎన్నిక వాయిదా పడుతుంది. దీంతో వైసీపీలో కలవరం మొదలైంది. ఇప్పటికే వైసీపీ పెద్దలు తమ జడ్పీటీసీలను ఆదివారం మధ్యాహ్నం నుంచి హైదరాబాద్‌లోని క్యాంపు శిబిరానికి తరలించారు. మూడు రోజుల పాటు వారిని అక్కడ ఉంచి బుధవారం సాయంత్రం కడపలోని మరో శిరానికి తీసుకొచ్చి గురువారం జరగనున్న చైర్మన్ ఎన్నికకు హాజరుపరచేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికను నిలుపుదల చేయాలని టీడీపీ జడ్పీటీసీ హైకోర్టును ఆశ్రయించడంతో అయోమయంలో పడ్డారు.

నిరుద్యోగులను నమ్మించి మోసం చేశారు

- పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేయడంలో టీడీపీ, వైసీపీ రెండూ ఒకటేనని పీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం ప్రొద్దుటూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధిస్తామని, ఉద్యోగాల విప్లవం తెస్తామన్న వైసీపీ అధ్యక్షుడు జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక హోదాపై చేతులెత్తేశారన్నారు. వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న 2.30 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. ప్రతి సంవత్సరం జనవరి 1న జాబ్‌క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీ చేస్తామని, నిరుద్యోగులను ఊరించి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో ప్రభుత్వ ఉద్యోగాలు రాక ప్రైవేటు ఉద్యోగాలు, స్వయం ఉపాధి పథకాలు లేక యువశక్తి నిర్వీర్యమైందన్నారు. కూటమి పాలనలో పది నెలలు అయినా డీఎస్సీ కార్యరూపం దాల్చలేదన్నారు. నిరుద్యోగ భృతి అమలు కావడంలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఏప్రిల్ 1 నుంచి నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీఎండీ నజీర్, ఖాజాపీర్, ఆలి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ చేయాలి



కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్

కడప, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ రికార్డులను అన్నింటినీ స్వచ్ఛీకరణ చేసి అప్‌డేట్ చేస్తే రెవెన్యూ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడుతుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళ, బుధవారాల్లో సచివాలయంలో రెండురోజుల పాటు కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్ ఈ సదస్సుకు హాజరయ్యారు. మంగళవారం రెవెన్యూ సమస్యల గురించి చంద్రబాబు చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిపై కూలంకషంగా విచారిస్తున్నామన్నారు. ఎలాగూ గ్రామసభలు నిర్వహిస్తున్నాం కాబట్టి ప్రతి రెవెన్యూ రికార్డును స్వచ్ఛీకరణ చేస్తే రెవెన్యూ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడుతుందని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కేసు నమోదు చేయడంలో ఎస్‌ఐ అన్యాయం చేస్తున్నారని ఆవేదన
- కలమల్ల పోలీసుస్టేషన్ వద్ద బాధితుల ఆందోళన... ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు



7

నిబంధనలు గాలికి..

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- అటకెక్కిన ఆహార తనిఖీలు
- రోగాలపాలవుతున్న ప్రజలు

7

అనుమానం పెనుభూతమై..

- మద్యం మత్తులో భార్యను చంపిన భర్త
- ఆపై తాను రైలుకింద పడి ఆత్మహత్య




సుజాత (ఫైల్), చెన్నకేశవులు (ఫైల్)

వల్లూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ముందు రోజు సాయంత్రం వరకూ ఆడుతూ పాడుతూ సంతోషంగా గడిపిన ఆ ఇంట్లో మరుసటి రోజు తెల్లవారే సరికి మృత్యుఘంటికలు వెగాఆయి. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త మద్యం మత్తులో ఆమెను నరికి చంపడంతో పాటు తానూ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, పోలీసుల వివరాల మేరకు..

వల్లూరు మండలం అంబవరం గ్రామానికి చెందిన ఎర్రగుడిపాడు చెన్నకేశవులు (45), సుజాత (40) భార్యభర్తలు. వీరికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దకుమారుడు సంతోష్‌కుమార్‌తో కలసి చెన్నకేశవులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. రెండో కొడుకు, కూతురు చదువుకుంటున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన చెన్నకేశవులు భార్య సుజాతను తీవ్రంగా వేధించేవాడు. దీంతో ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ క్రమంలో పెద్ద కుమారుడు సంతోషకుమార్‌కు నెలక్రితం వివాహం జరిగింది. ఉగాదికి సాంగ్యమని, బంధువులు అందరం వచ్చామని సంతోషంగా ఉందాం రమ్మని చెప్పడంతో సుజాత కూడా అంబవరం గ్రామానికి వచ్చింది. అయితే సోమవారం రాత్రే సంతోష్‌కుమార్ అతడి భార్య అత్తగారింటికి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉన్న భార్య సుజాతను చెన్నకేశవులు మద్యం తాగి మచ్చుకత్తితో నరకడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. తనను ఎవరైనా ఏమైనా చేస్తారేమోనని భయపడిన చెన్నకేశవులు సైతం గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద ఉదయం సుమారు 10గంటల సమయంలో రైలుకింద పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐ రోషన్, ఏఎస్ఐ ప్రసాద్, పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంబవరం గ్రామంలో ఇంట్లో ఉన్న సుజాత మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. చెన్నకేశవులు మృతదేహాన్ని కూడా రైల్వే పోలీసులు రిమ్స్‌కు తరలించారు. కొడుకు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్‌లో.. కందిపప్పు మాయం

- మూడు నెలలుగా అందని వైనం
- పేదలపై నెలకు పడే భారం రూ.4.26 కోట్లు



బద్వేలు టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాలు కేవలం బియ్యం, చక్కెరకే పరిమితం అయ్యాయి. గతంలో బియ్యంతో పాటు గోధుమలు, జొన్నలు, రాగులు, కందిపప్పు, చక్కెర సబ్సిడీపై సరఫరా చేసేవారు. వైసీపీ హయాంలో రేషన్ వ్యవస్థలో విపరీత మార్పులు తేవడంతో పాటు సరుకుల్లో కోత పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత టీడీపీ హయాంలో ఇచ్చినట్లుగా కార్డుదారులకు కొద్దిరోజులు సరుకులు అందించారు. ఇటీవల బియ్యం, చక్కెర మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు ఇవ్వడం లేదు. చౌక దుకాణాల ద్వారా కార్డుదారులకు అందించే కందిపప్పు నిలిపివేయడంతో పేదలు పప్పన్నం బదులు, పచ్చడి మెతుకులు తింటూ జీవనం సాగిస్తున్నారు. మూడు నెలలుగా కందిపప్పు అందక ఇబ్బందులు పడుతున్నామని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,239 చౌకదుకాణాలు ఉండగా 5,84,600 రేషన్ కార్డులు ఉన్నాయి. యూనిట్లుగా తీసుకుంటే 16,35,771 లబ్ధిదారులుంటారు. రేషన్ దుకాణాల్లో మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. డీలర్లను ప్రశ్నించగా కందిపప్పు గోదాముల నుంచి సరఫరా కావడం లేదని చెబుతున్నారు. అయితే కందిపప్పు బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.140 పలుకుతోంది. చౌకదుకాణాల ద్వారా రూ.67కు ఇస్తున్నారు. అంటే బహిరంగ మార్కెట్‌లో వీరు కిలో కందిపప్పు కొనాలంటే అదనంగా రూ.73 ఖర్చు చేయాల్సి వస్తుంది. అంటే ఒక్క నెలలో సబ్సిడీ కందిపప్పు అందకపోవడంతో 5,84,600 కార్డుదారులకు పడే భారం రూ.4.26 కోట్లు. ఎండీయూ ఆపరేటర్లు, రేషన్‌దుకాణాల డీలర్లు కుమ్మక్కై దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కందిపప్పు రేషన్ దుకాణం ద్వారా సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు.



రేషన్ దుకాణాల ద్వారా అందించే కందిపప్పు

కాగా.. రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు కాకపోవడంపై బద్వేలు తహశీల్దార్ నరసమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా చేయడం లేదన్నారు. ప్రభుత్వం కందిపప్పు సరఫరా కాగానే కార్డుదారులకు అందజేస్తామని తెలిపారు.

ఎగిసిన మంటలు ... తప్పిన పెను ప్రమాదం

7

నమ్మండి.. ఇవి పొగాకు మొక్కలే!



రోడ్డు నుంచి వచ్చే దుమ్ము పొగాకు మొక్కలపై పేరుకుపోయిన దృశ్యం

ఈ చిత్రంలో కనిపిస్తున్నవి మట్టిబొమ్మలు కాదు. ఎండిపోయిన మొక్కలు అంతకన్నా కాదు. పచ్చగా కళకళలాడాల్సిన పొగాకు మొక్కలు ఇలా మట్టిపేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. పెద్దముడియం మండలం గుండ్లకుంట గ్రామ శివార్ల నుంచి జమ్మలమడుగు మండలంలోని ఎస్.ఉప్పలపాడు మీదుగా బైపాస్ రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. రోడ్డులో ఎర్రమట్టి రాళ్లు, కంకర పరచి నీళ్ల వేయకపోవడంతో వాహనాలు వచ్చినప్పుడు దుమ్ము లేచి ఇలా రోడ్డు పక్కన ఉన్న పైర్లపైన చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలపై పెద్దఎత్తున దుమ్ము చేరుతుండటంతో పంట దిగుబడి సరిగా రాదేమో అని ఆందోళన చెందుతున్నారు. రోడ్డు పనులు ప్రారంభించినా ఇంకా నష్టపరిహారం ఇవ్వలేని కొందరు రైతులు అంటున్నారు. ఇప్పటికైనా క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఆ రోడ్డును పరిశీలించి పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని.. అలానే సంబంధిత అధికారులు తమకు నష్టపరిహారం ఇవ్వాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- (జమ్మలమడుగు-ఆంధ్రజ్యోతి)

విద్యార్థిని కేశదానం



కేశాలు దానం చేస్తున్న విద్యార్థినితో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితులకు తోడుగా నిలవాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న హెయిర్ డోనేషన్ కార్యక్రమానికి మహిళలు, చిన్నారులు చేయూత నిస్తున్నారని హెల్పింగ్ మైండ్స్ సభ్యులు తెలిపారు. మంగళవారం పదవ తరగతి విద్యార్థిని అఖిరా రాయల్ మంగళవారం తన కేశాలను దానం చేయడంతో హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకుడు అబూబకర్ సిద్దక్ పూల మొక్కను అందించి ప్రశంసించారు. కార్యక్రమంలో రమేష్ రాయల్, మాలతి, సభ్యులు బషీర్, కిరణ్, హర్ష, చైతు, సాంబ, వేదిక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

మదనపల్లె అర్బన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మిషన్ కాంపౌండ్ ఎదురు సందులోని ఓ మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ చేశారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానికంగా నివసిస్తున్న వెంకటమ్మ (67) మంగళవారం ఉదయాన్నే ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా, బైక్‌పై ముసుగు ధరించి వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముంచిన 'ఉద్యానం'



కలకడ మండలంలో సాగు చేసిన టమోటా పైరు

- రబీ రైతుకు తీరని కష్టాలు
- శాపంగా టమోటా, వంగ దోస సాగు
- దిగుబడులు చేతికొచ్చే సరికి పడిపోయిన డిమాండ్
- ధరల పతనంతో రూ. లక్షలు నష్టం

కలకడ, మార్చి 25(ఆంధ్రజ్యోతి):రబీ సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసిన రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. వీలేరు ఉద్యాన శాఖ పరిధిలోని కలకడ, కేవీపల్లె, వీలేరు మండలాల్లో టమోటా 550 ఎకరాలు, దోస 200 ఎకరాలు, చెప్పుకోదగ్గ విస్తీర్ణంలో వంగ పైర్లు సాగు చేశారు. దుక్కుల స్థాయి నుంచి క్రిమిసంహారక మందులు, పూత దశ వరకు టమోటాకు ఎకరానికి రూ.2.5 లక్షలు, దోస, వంకాయకు రూ.లక్ష నుంచి 1.30 లక్షల పెట్టుబడి పెట్టారు. కాగా, కలకడ మార్కెట్ నుంచి టమోటా, వంకాయలు తమిళనాడు ప్రాంతంలోని వివిధ రాష్ట్రాలకు, ఆంధ్ర, తెలంగాణ, డిల్లీ, కలకత్తా, చత్తీస్‌గడ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. ప్రస్తు తం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా సరుకు లభ్యత ఎక్కువ కావడంతో ధరల పతనానికి నాంది పడినట్లు వ్యాపారులు తెలిపారు. ఇక దోస పంట తమ పాలిట శాపంగా మారినట్లు రైతులు వాపోతున్నారు. సాధారణంగా ఎకరాకు 15 నుంచి 20 టన్నులు దిగుబడి వచ్చే దోస కానీ వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం తో ఈ ఏడాది ఎకరాకు 3 నుంచి 5 టన్నులు మాత్రమే వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక దళారుల కారణంగా మరింత నష్టాలను చవిచూస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



కోయకుండా వదిలేసిన వంగ తోట

దిగుబడి ఉన్నా.. ధర లేదు



భూమి లీజుకు తీసుకుని రెండు ఎకరాల్లో వంకాయ పంట సాగు చేశా. రెండు, మూడు కోతల వరకు మంచి ధర లభించింది. తరువాత ధర పడిపోవడంతో పంటను వదిలేశా. దిగుబడి ఉన్నా ఖర్చులు పెరిగిపోవ డంతో కోయకుండానే వదిలేశా.

- రామ్‌కిశోర్, కలకడ.

నష్టాలను మూటగట్టుకుంటున్నాం



3.5 ఎకరాల్లో టమోటా సాగు చేశాం. ఎకరాకు రూ.3 లక్షలు ఖర్చయింది. ధరలు పాతాళానికి పడిపోయాయి. కోత కూలి చెల్లించేందుకు చేతి నుంచి డబ్బు పెట్టాల్సిన పరిస్థితి. దీంతో అసలుకే ఎసరు వచ్చి నష్టాలను మూటగటుకుంటున్నాం.

- గణపతిరెడ్డి, గొల్లపల్లె, కలకడ మండలం

రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కూడా: సీఎం చంద్రబాబు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి సోమవారం రాత్రి సీఎంను కలవగా పైవిధంగా స్పందించారు. త్వరలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి యూనివర్సిటీల ఏర్పాటుపై సానుకూల నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ రెండు యూనివర్సిటీల ఉద్యోగుల జీతాల సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వర్సిటీల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలని సీఎం వారికి సూచించారు.

మద్యపాన దుష్పరిణామాలపై అవగాహనకు 'కేర్'

- కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యపాన వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పాన్సివ్ ఎడ్యుకేషన్'(కేర్) పేరుతో ఎక్సైజ్ శాఖ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిపై మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. బహిరంగ సదస్సులు, ఫ్లాష్ మాబ్‌లు, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ, సెమినార్లు, సెషన్ల రూపంలో ప్రజల్లో అవగాహన కల్పించడం దీని ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కమిటీలు నియమించింది. రాష్ట్ర స్థాయి కమిటీకి ఎక్సైజ్ శాఖ మంత్రి ఛైర్మన్‌గా ఉంటారు. ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్, అదనపు కమిషర్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, ఎన్‌జీవో నుంచి ఒకరు, మరో ఇద్దరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు ఇందులో ఉంటారు. జిల్లా స్థాయి కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా ఉంటారు. ఎస్పీ, జిల్లా ఎక్సైజ్ అధికారి, విద్యా ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు.

మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా ప్రసన్న వెంకటేశ్

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ప్రసన్న వెంకటేశ్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న కె.హర్షవర్ధన్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో ప్రసన్న వెంకటేశ్‌ను నియమించడంతో పాటు ఎస్సీ కమిషన్ కార్యదర్శిగా కూడా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

టెంపో బోల్తా : ఒకరి మృతి

- ఐదుగురికి గాయాలు





బోల్తాపడిన టెంపో, మృతి చెందిన సింహాచలం గౌడ్

బి.కొత్తకోట, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కాంక్రీట్ పనులకు కూలీలను తీసుకెళుతున్న టెంపో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒకరు మృతి చెందగా, ఐదుగురు గాయపడ్డారు. సీఐ జీవన్‌గంగనాథ బాబు తెలిపిన వివరాల మేరకు.. ఒరిస్సా నుంచి బి.కొత్తకోటకు వలస వచ్చిన సింహాచలంగౌడ్(50), కైలాస్‌గౌడ్(54) మంగళవారం ఉదయం మేస్త్రీ శ్రీనివాసులు పిలుపు మేరకు మరో ముగ్గురు కూలీలతో కలిసి కర్ణాటకలోని రాయల్పాడుకు బయలుదేరారు. టెంపో వెనుక భాగంలో కాంక్రీటు కలిపే మిల్లర్‌ను తగిలించుకున్నారు. వారు ప్రయాణిస్తున్న టెంపో గట్టు పంచాయతీ పరిధిలోని టేకులమంద వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో వున్న ఐదుగురూ కింద పడిపోయారు. వీరిలో సింహాచలంగౌడ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కైలాస్‌గౌడ్, శ్రీనివాసులు తదితరులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డవారిని, మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కోడూరు వాసి మృతి

- అరుణాచలం వెళ్లి వస్తుండగా ప్రమాదం



నరసింహారెడ్డి మృతదేహం

రైల్వేకోడూరురూరల్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం కోసం తమిళనాడులోని తిరువణ్ణామలైకి వెళ్లిన ఓ వ్యక్తి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి మండలంలోని రాఘవరాజు‍పురం (సత్రం) పంచాయతీకి చెందిన కౌలు రైతు వెలిగిచెర్ల నరసింహారెడ్డి (45) కోడూరు పట్టణంలోని పగడాలపల్లెకు చెందిన ముగ్గురు స్నేహితులతో కలిసి తిరువణ్ణామలైకి వెళ్లి వస్తుండగా చిత్తూరు జిల్లా పాకాల వద్ద వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహారెడ్డి అక్కడిఅక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డాడు. ఆయనకు భార్య రజిని, కొడుకు ఈశ్వర్, ఐదు నెలల పాప ఉంది. మరణవార్త తెలియగానే రాఘవరాజు పురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని తీసుకురావడానికి కుటుంబ సభ్యులు చిత్తూరు జిల్లాకు తరలివెళ్లారు.

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి

రాజంపేటటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ఒంగోలుకు చెందిన ముద్దా మల్లికార్జున (25) రాజంపేటలో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ భవనం కూల్చివేత పనులు చేస్తూ, రెండు అంతస్థుల పైనుంచి పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రాజంపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోతబోలు కాలనీలో హౌసింగ్ రీ వెరిఫికేషన్



హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె అర్బన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతబోలు గ్రామంలో ఏర్పాటు చేసిన జగన్న కాలనీలో మంగళవారం తహసీల్దార్ ధనంజయులు తన సిబ్బందితో కలిసి వెళ్లి హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహించారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన ఇంటి పట్టాను, ఆధార్‌కార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇచ్చిన ఇళ్లపై హౌసింగ్ రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నామని లబ్ధిదారులు సక్రమంగా సమాచారంఇవ్వాలని కోరారు. ఇందులో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు అమ్మకాలు చేసిన, మరొకరికి మంజూరైన పట్టాల్లో ఇళ్లు నిర్మించుకుంటే చెల్లవని హెచ్చరించారు. అన్ని స్పష్టంగా పరిశీలిస్తున్నట్లు వివరించారు. పరిశీలనలో అవకతవకలు బయట పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శేషాద్రి రావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుష్టు బాధితులపై వివక్ష తగదు

- జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్



కుష్టువ్యాధిపై సమీక్షకు హాజరైన జాతీయ మానవ హక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్‌కుమార్

రాయచోటిటౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కుష్టు బాధితులపై వివక్ష చూపరాదని జాతీయ మానవహక్కుల కమిషన్ కన్వీనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో లైన్ డిపార్టుమెంట్ అధికారులతో (వైద్య ఆరోగ్యశాఖ, సాంఘీక సంక్షేమశాఖ, మానసిక ఆరోగ్య శాఖ, ఇతర శాఖలు) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంత మంది కుష్టు రోగులు ఉన్నారు. వారిలో ఎంతమంది చికిత్స పొందుతున్నారు. ఈ వ్యాధి కారణంగా ఎంతమంది అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఎంత మందికి పెన్షన్ ఇస్తున్నారు. సిబ్బంది కొరత ఉందా? సమస్యలు ఏవైనా ఉన్నాయా? పాలసీలో ఏవైనా మార్పులు అవసరమా వంటి అంశాలపై ఆరా తీశారు. అనంతరం రైల్వేకోడూరులో ఉన్న జ్యోతి కాలనీలోని కుష్టు బాధితులతో వర్చువల్‌గా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. మరింత మెరుగ్గా కుష్టు నివారణ కార్యక్రమం అమలుకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, అదనపు అధికారి డాక్టర్ శైలజ, జిల్లా న్యూక్లీష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శివప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే 'సత్సంగ్' ధ్యేయం

- పద్మభూషణ్ ముంతాజ్‌అలి





సత్సంగ్ విద్యాలయ విద్యార్థుల నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న పద్మభూషణ్ ముంతాజ్‌అలి

మదనపల్లె టౌన్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో ఉజ్వల భవిష్యత్ అందించడమే సత్సంగ్ ఫౌండేషన్ ధ్యేయమని పద్మభూషణ్ ముంతాజ్‌అలీ తెలిపారు. మంగళవారం స్థానిక సత్సంగ్ ఆశ్రమం వద్ద సత్సంగ్ విద్యాలయ రజతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థాపించిన ఈ విద్యాలయంలో పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబుద్ధులు అందిస్తున్నామన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఆధునిక గ్రంథాలయం, యోగా, నాట్యం, లైఫ్ స్కిల్స్ నేర్పడానికి తర్ఫీదు పొందిన 18 మంది ఉపాధ్యాయులను నియమించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ స్టీఫెన్ మాథ్యూస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నవోదయ'కు 37 మంది విశ్వం విద్యార్థుల ఎంపిక



నవోదయలో సీట్లు సాధించిన విద్యార్థులు

తిరుపతి(విద్య), మార్చి25 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ప్రవేశపరీక్షల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు 37మంది ఎంపికైనట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. విక్రమ్, గోపిక, జీవన్, సాయిరెడ్డి, శరత్‌చంద్ర, నవదీప్‌యాదవ్, జాహ్నవి, జశ్వంత్, మిథున్, మిహాల్, నితీష్‌సాయి, సోహిని, అభ్యుదయ, సోహిత్‌తోపాటు మొత్తం 37మంది సీట్లు సాధించారన్నారు. 35 సంవత్సరాలుగా జాతీయస్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షల్లో తమ విద్యార్థులు విజయపరంపర కొనసాగిస్తున్నారని చెప్పారు. ఉత్తమ ఫలితాలతోపాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందంటూ విద్యార్థులను అభినందించారు. ఎంపికైన వారికి కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందనలు తెలిపారు.

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టంలో భాగంగా రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటో తరగతిలో అడ్మిషన్లకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై న్యాయ వివాదాలు ఏర్పడిన నేపథ్యంలో ఈ మేరకు స్పష్టతనిచ్చింది. 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు విద్యా సంస్థలు 25శాతం సీట్లను పేద విద్యార్థులకు కేటాయించాలి. వారికి ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుంది.

మెడికల్ కాలేజీఅసిస్టెంట్ ప్రొఫెసర్ బదిలీ

కలికిరి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.గోపీకృష్ణను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దంపతుల కేటగిరీని పరిగణనలోకి తీసుకుని ఆయనను గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా వున్న జనరల్ సర్జరీ విభాగానికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో పశువులకు గండం!

- ప్రాణాలు కోల్పోతున్న ఆవులు



ప్లాస్టిక్ వ్యర్థాలు తింటున్న పశువులు

రాజంపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీధుల్లో పడివున్న ప్లాస్టిక్ వ్యర్థాలు మూగజీవాలకు శాపంగా మారుతున్నాయి. ఆవుల యజమానులు వాటిని మేత కోసం బయటికి వదులుతుండడం, పట్టణంలో తగిన ఆహారం లభించకపోవడంతో అవి ఏది దొరికితే అదే తినేస్తున్నాయి. దీంతో అనారోగ్యం పాలై చనిపోతున్నాయి. పట్టణంలోని పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, నూనెవారిపల్లెరోడ్డు, హైవేరోడ్డు, ఆర్ఎస్ రోడ్డు, రైల్వేస్టేషన్, ఉస్మాన్‌నగర్, మార్కెట్ ఇలా అన్ని ప్రాంతాల్లో ఇలాంటి ఆవులు వందలకొద్దీ ఉన్నాయి. పట్టణంలో తిరుగుతున్న పశువులను మున్సిపల్ అధికారులు పట్టుకుని వాటి యజమానులకు అప్పగించి ఎక్కడా తిరగకుండా చర్యలు తీసుకోవాల్సి ఉండగా, వారు ఆ పని చేయకపోవడంతో సమస్య తీవ్రంగా మారుతోంది.

గో పరిరక్షణకు నడుం బిగించాలి



పూజలందుకునే గోవులు పట్టణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ అనారోగ్యంపాలు కావడం బాధాకరం. పట్టణ ప్రజలు, ప్రముఖులు ప్రధానంగా మున్సిపల్ అధికారులు దీనిపై ఒక ఆలోచనకు రావాలి. ఆవుల పరిరక్షణకు పట్టణంలో బర్రెల గ్రౌండ్‌ను ఏర్పాటు చేసి దాతల సహకారంతో దాణా, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసి ఆవులను రక్షించుకోవాలి. ఇందుకు నా వంతుగా సహకరిస్తా. అవసరమైతే కలెక్టర్ సహకారాన్ని తీసుకుంటాం

- డాక్టర్ జీఎన్‌నాయుడు, టీడీపీ సీనియర్‌నేత

పాఠశాలల్లో 'స్కౌట్' తప్పనిసరి

- డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుండే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటుల ఉద్యమం (స్కౌట్స్ అండ్ గౌడ్స్) తోడ్పడుతుందని డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం బాలికల ఉన్నత పాఠశాలలో స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిట్ లీడర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో ప్రవేశం పొందిన విద్యార్థుల వివరాలను మార్చి 31వ తేదీ లోగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుండే తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం పాఠశాలల్లో నిర్వహించాల్సిన స్కౌట్ కార్యకలాపాలపై జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి యూనిట్ లీడర్లకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ అండ్ గైడ్ జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, ఏఎస్‌వోసీ లక్ష్మీకర్, రీసోర్స్‌పర్సన్ గురుప్రసాద్‌రెడ్డి, రాజంపేట, రాయచోటి డివిజన్లలోని స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్స్, క్లబ్ మాస్టర్స్, ప్లాక్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

'బాస్' రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పల్లం తాతయ్య



రాయచోటిటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న గుంటూరులో జరిగిన భారతీయ అంబేద్కర్ సేన (బాస్) కేంద్ర కమిటీ సమావేశంలో బాస్ వ్యవస్థాపకుడు, పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి వచ్చిన బాస్ ప్రతినిధుల సమక్షంలో పల్లం తాతయ్యను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ మహనీయులైన బుద్ధుడు, పూలే, పెరియార్, అంబేద్కర్ ఆశయాలను, వారి ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తానన్నారు. రాష్ట్రంలో జరిగే సామాజిక పోరాటాలకు మద్దతు ఇవ్వడమే కాకుండా బాస్ సంస్థ ద్వారా న్యాయపరమైన పోరాటాలతో ప్రజల పక్షాన నిలుస్తామన్నారు. కుల నిర్మూలన, స్టేట్ సోషలిజమే ప్రధానంగా బాస్ పోరాటాలు ఉంటాయన్నారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్‌కు, కేంద్ర కమిటీ సభ్యులకు, 26 జిల్లాల బాస్ ప్రతినిధులకు తాతయ్య ఉద్యమాభివందనాలు తెలియజేశారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణలపై ఫిర్యాదు

సుండుపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్థలం కాజేయాలని చూస్తున్నారని విజయవాడలో ప్రజాదర్బార్, జనవాణిల్లో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నంశెట్టి రామాంజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లి దగ్గర సర్వే నెంబరు 2103-4లో 45 సెంట్లు విలువైన స్థలాన్ని కాజేయాలని చూస్తున్నారని, ప్రభుత్వ స్థలానికి అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదే స్థలంలో చెన్నంశెట్టిపల్లె గ్రామస్తులు కొన్ని దశాబ్దాల నుంచి కాటమరాయుడికి పూజలు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ స్థలానికి ఇనుప కంచె వేసి తమ ఆధీనంలో ఉంచుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే అన్నమయ్య కలెక్టర్, సుండుపల్లె రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కోట్ల విలువ చేసే స్థలాన్ని కాపాడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

నాటుసారా వదిలేయండి



నిందితుడిని బైండోవర్ చేస్తున్న తహసీల్దార్

వాల్మీకిపురం, మార్చి 25(ఆంధ్రజ్యోతి): నాటుసారా తయారీ, విక్రయాలు విడిచిపెట్టి సమాజంలో మంచిగా బతకాలని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి సూచించారు. మంగళవారం ఎక్సైజ్ అధికారులు పాత కేసుల్లో నిందితులను ఆయన ఎదుట బైండోవర్ చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగువ మేకలవారిపల్లె వాసి నారాయణను తహసీల్దార్ మందలించారు. ఎక్సైజ్ సర్కిల్‌లోని కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాలకు ఇప్పటి దాకా నాటుసారా పాతకేసుల్లో ఉన్న 84మందిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ లత తెలిపారు. పూర్తిస్థాయిలో తయారీ, విక్రయాలు అరికట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోజూ గ్రామాల్లో నవోదయం సమావేశాలు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ (ఫైల్)

సీకేదిన్నె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని సుగాలిబడికి సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కొర్న సూర్యనారాయణ (60), ఆదినారాయణ (30)అనే వ్యక్తులు మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి నుంచి కడపకు ట్రాక్టర్‌లో రాతి స్తంభాలు తీసుకు వస్తుండగా సుగాలిబడికి సమీపంలోకి రాగానే ట్రాక్టర్ ట్రాలీ టైరు పేలి ఒక్కసారిగా అదుపు తప్పింది. అలాగే ట్రాక్టర్ ఒక్కసారిగా స్లో కావడంతో వెనుక వస్తున్న టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో ట్రాక్టరును ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ పక్కన కూర్చున్న ఆదినారాయణ కిందపడిపోయాడు. ట్రాక్టర్, టిప్పర్ డ్రైవర్లు కిందపడిన ఆదినారాయణకు మంచినీరు తాపిస్తుండగా కడప నుంచి రాయచోటి వెళుతున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగంగా వచ్చి టిప్పర్ డ్రైవర్‌ను ఢీకొంది. దీంతో గాయపడిన టిప్పర్ డ్రైవర్‌ను, కిందపడిన ఆదినారాయణను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. ఇరువురు చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా టిప్పర్ డ్రైవర్ సూర్యనారాయణది అలంఖాన్‌పల్లె కాగా, ఆదినారాయణ రాయచోటి మండలం బోయపల్లి గ్రామస్థుడని సీకేదిన్నె పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి, మత్తు పదార్థాల అక్రమరవాణాపై విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ రమణారెడ్డి, పోలీసులు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు రవాణా జరగకుండా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా విశాఖపట్నం, విజయవాడ నగరాల నుంచి కడపకు వచ్చే రైలు, బస్సులు, పార్సిల్ కేంద్రాల్లో పోలీసు అధికారులు, స్పెషల్‌పార్టీ సిబ్బంది, జీఆర్పీ, ఆర్‌పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం విశాఖ నుంచి కడపకు చేరుకున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేపట్టి ప్రయాణికుల లగేజీలను గాలించారు. బస్టాండు, సెవెన్‌రోడ్స్ వద్ద ఉన్న ప్రైవేటు బస్సుల్లో, కార్యాలయాల్లో పార్సిల్ సెంటర్ల గోడౌన్లలో తెల్ల వారు జామున విస్తృత తనిఖీలు చేశారు. ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టరు రమణా రెడ్డి, జీఆర్పీ ఎస్‌ఐ సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ నాగభూషణం, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

బేకరీలో అగ్నిప్రమాదం.. రూ.4లక్షలు నష్టం


బేకరీలో దగ్ధమైన వస్తువులు

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం కడప రోడ్డులో ఉన్న బెంగళూరు బేకరీలో మంగళవారం తెల్లవారు జాము ప్రాంతంలో బేకరీలో వెనుక వస్తువులు తయారు చేసే గదిలో మంటలు అంటుకున్నాయి. కొంత సేపటికి పొగలు రావడంతో స్థానికులు బేకరీ యజమానికి సమాచారం ఇచ్చారు. అలాగే వేంపల్లె అగ్నిమాపక కార్యాలయానికి తెలియజేశారు. హుటాహుటిన అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే రూములో ఉన్న వస్తువులు కాలిపోవడంతో సుమారు రూ.4లక్షలు నష్టం వాటిల్లినట్లు బేకరీ యజమాని సంతోష్‌కుమార్ తెలిపారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రెండు బైకులు ఢీ...ఇద్దరికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన రాజారెడ్డి, చక్రేనాయక్

చక్రాయపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్లమడక బీసీ కాలనీ రాయచోటి-వేంపల్లె మెయిన్‌రోడ్డులో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మారెడ్డిగారిపల్లెకు చెందిన రాజారెడ్డి, కడప సమీపంలోని మద్దిమడుగుబిడికికి చెందిన చక్రేనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే... చక్రేనాయక్ సోమవారం రాత్రి కుప్పంలోని తన బంధువుల ఇంట్లో జరుగుతున్న ఫంక్షన్‌కు హాజరై మంగళవారం సాయంత్రం తన ఇంటికి బయలుదేరాడు. అదే సమయంలో రాజారెడ్డి వేంపల్లెకు వెళ్లి సరుకులు తీసుకొని చక్రాయపేటకు వస్తుండగా మారెళ్లమడక బీసీ కాలనీ వద్ద ఇద్దరు ఢీకొన్నారు. దీంతో చక్రేనాయక్‌కు కాళ్లు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. రాజారెడ్డికి తీవ్రరక్త గాయాలయ్యాయి. వీరిని వేంపల్లెకు తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించినట్లు తెలిసింది.

నెల్లూరు జిల్లాలో పోరుమామిళ్లవాసి మృతి


నాగరాజు మృతదేహం

పోరుమామిళ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాయపల్లె గ్రామానికి చెందిన మజ్జూరి నాగరాజు (35) నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు నాగరాజు కుటుంబ పోషణ కోసం నెల్లూరు జిల్లా సీతారామపురం మండలం నారాయణమ్మపేట గ్రామ సమీపంలో జరుగుతున్న సిక్స్‌వే రోడ్డు పనుల వద్ద కూలీ పనికి వెళ్లాడు. మంగళవారం పనులు చేస్తుండగా గ్రైండర్ మిషన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే ఆ కంపెనీ వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. విషయం తెలియడంతో బంధువులు, కుటుంబ సభ్యులు ఆవేదన చెందారు. మృతుడు నాగరాజుకు ఇంకా వివాహం కాలేదని... అనారోగ్యంతో ఉన్న పోషించుకుంటూ ఉండేవాడని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

- కేసు నమోదు చేయడంలో ఎస్ఐ అన్యాయం చేస్తున్నారని ఆవేదన
- కలమల్ల పోలీసుస్టేషన్ వద్ద బాధితుల ఆందోళన... ఉద్రిక్తత
- భారీగా మోహరించిన పోలీసులు

ఎర్రగుంట్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కలమల్ల-పోట్లదుర్తి రహదారిలో సోమవారం సాయంత్రం వ్యాన్ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఆర్టీపీపీ కాంట్రాక్టు కార్మికుడు బి.రాజారెడ్డి, అతని సతీమణి సుజాతలు మృతి చెందారు. ప్రమాద స్థలంలోనే రాజారెడ్డి మృతి చెందగా, సుజాత కర్నూలులో చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథల య్యారు. ఇదిలా ఉండగా కేసు నమోదు చేయడంలో కలమల్ల ఎస్ఐ తిమోతి తమకు అన్యాయం చేస్తున్నాడని మృతుల బంధువులు మంగళవారం ఉదయం కలమల్ల పోలీసు స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ధర్నాకు దిగారు. నిందితునికి ఎస్ఐ వత్తాసు పలుకుతున్నాడని ధ్వజమెత్తారు. ఆవేశంతో వారు ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. ఒక్కసారిగా స్టేషన్‌పైకి రావడంతో ఉద్రిక్తత నెలకొంది. బాధితులను కంట్రోల్ చేయడం కాక పోవడంతో పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. నలుగురు సీఐలు, ఎస్ఐలు, 50మంది వరకు పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. సుమారు నాలుగు గంటల పాటు మృతుని బంధువులు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అక్కడికి చేరుకోవడంతో మరింత ఉద్రిక్తత పెరిగింది. పోలీసు అధికారులతో చర్చలు జరిపారు. బాధితులకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు.

పోలీసుల రాయబేరాలు

బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన విరమించమని భీష్మించడంతో వ్యాన్ డ్రైవర్‌తో, బాధిత కుటుంబాలతో పోలీసులు చాలా సేపు మంతనాలు జరిపారు. అయితే రూ.లక్షతో మొదలైన సహాయం చివరకు డీఎస్పీ వేంకటేశ్వరరావు సమక్షంలో రూ.4లక్షలు ఇచ్చేందుకు ఒప్పుకోవడంతో ఆందోళన విరమించారు.


తల్లిదండ్రుల మృతదేహాల వద్ద విలపిస్తున్న బాలికలు

అనాథలైన బాలికలు

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేస్తున్న రాజారెడ్డికి ఇద్దరు కుమార్తెలు. హర్షిత మోహన్‌బాబు కాలేజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతుండగా, రాజశ్రీ ఇంటర్ సెకం డియర్ విజయవాడలో పరీక్షలు రాసింది. రోడ్డుప్రమాదంలో తల్లిదండ్రులిద్దరూ దుర్మరణం చెందడంతో ఆ పిల్లలు అనాథలుగా మారారని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల మరణాన్ని జీర్ణించుకోలేని ఆ ఇద్దరు బాలికలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మంగళవారం సాయంత్రం మృతదేహాలు కలమల్లకు తీసుకొచ్చారు.

ఎట్టకేలకు వేంపల్లె బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలు


బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలను ప్రారంభిస్తున్న అధికారులు, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ప్రయాణీకుల సౌకర్యార్థం కోట్లాది రూపాయలతో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ ఎట్టకేలకు అందుబాటులో వచ్చింది. దాదాపు పనులు పూర్తయినా బస్టాండ్ ప్రారంభించక పోవడంతో నాలుగు నెలలుగా స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి అవస్థలను గమనించి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చి.. ఆయన అప్పటికప్పుడు ఆర్టీసీ ఈడీతో, ఇతర అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న చిన్నచిన్న పనులను పూర్తి చేయించి బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లేలా ఎమ్మెల్సీ చొరవ చూపారు. యదావిధిగా బస్సుల రాకపోకలు సాగించేలా పులివెందుల ఆర్టీసీ డీఎం సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. మంగళవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆర్టీసీ డీఎం ఇతర సిబ్బంది బస్టాండ్‌ను పరిశీలించారు. పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా పది పదిహేను రోజుల తర్వాత ఆర్టీసీ బస్టాండ్‌ను మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, సవితలు ప్రారంభిస్తారని ఎమ్మెల్సీ తెలిపారు. కంట్రోలర్‌గా చెన్నకేశవరెడ్డిని నియమిస్తున్నట్లు డీఎం రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జీవీ రమణ, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి, మండల మాజీ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో కేంద్ర హ్యూమన్‌రైట్స్ కమిషనరు పర్యటన

కడప కలెక్టరేట్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి నివారణలో భాగంగా జాతీయ మానవ హక్కుల కమిషనర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ నాయక్(స్పెషల్ మానిటర్) వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు రోజులుగా పర్యటిస్తున్నారు. సోమవారం రాత్రి డీఎంహెచ్ కార్యాలయంలో డీఎంహెచ్‌హెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు అందరు సమన్వయంగా కృషి చేసి 2027 నాటికి కుష్ఠు రహిత సమాజాన్ని స్థాపించాలని ఆదేశించారు. మానవహక్కుల కమిషన్ ప్రజల హక్కులకు భంగం కలగకుండా పని చేస్తుందని దిశా నిర్దేశం చేశారు. ఈనెల 28వ తేదీ వరకు కడప జిల్లాలో జమ్మలమడుగు, అన్నమయ్య జిల్లాలో పలు ఆసుపత్రులను సందర్శిస్తారు. ఈనెల 29న కడపలో వైద్యాధికారులతో సమావేశం నిర్వహిస్తామని జిల్లా కుష్ఠు, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు తెలియజేశారు.

పింఛన్ల పంపిణీకి నిధులు విడుదల

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. వచ్చే ఏప్రిల్ 1వ తేదీ లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా పింఛన్ల పంపిణీ సిబ్బందికి డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ సూచించారు. 256243 పింఛన్లకు సంబంధించి రూ.110.495 కోట్లు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టండి : ఎస్ఈ


వేంపల్లెలో రోడ్డు పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేంపల్లెలో ఈఏపీ నిధులు రూ.1.19 కోట్లతో ఎద్దలకొండ రోడ్డును, అలాగే సాయిబాబా ఆలయం నుంచి బైపాస్‌రోడ్డు వరకు కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను మంగళవారం ఎస్ఈ తనిఖీ చేశారు. వెట్‌మిక్స్ పనులు జరిగాయి. తారురోడ్డు నిర్మాణం చేయాల్సి ఉంది. నాణ్యతను పరిశీలించిన ఎస్ఈ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతలో ఎక్కడ రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో డీఈ సుధాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, దేవస్థాన మాజీ ఛైర్మన్ ఎద్దల కొండ్రాయుడు,మాజీ సభ్యులు పివి రమణ, మాజీవార్డు సభ్యులు నల్లగారి కృష్ణారెడ్డి తదతరులు పాల్గొన్నారు.

ఎగిసిన మంటలు ... తప్పిన పెను ప్రమాదం


పులివెందుల లయోలా పాలిటెక్నిక్ సమీపంలో చెలరేగుతున్న మంటలు, ఆర్పుతున్న ఫైర్‌సిబ్బంది

పులివెందుల రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): లయోలా పాలిటెక్నిక్ కళాశాల గుట్టకు మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలిలా. మంగళవారం రాత్రి 7గంటల ప్రాంతంలో పాలిటెక్నికల్ కళాశాల సమీపంలో శ్రీకృష్ణుని ఆలయానికి వెళ్లే మార్గంలో మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి గడ్డిలో వేయడంతో ఈ మంటలు చెలరేగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. మంటలకు సమీపంలో తూర్పువైపున విద్యుత్ సబ్‌స్టేషన్, పడమర వైపున తాగునీటి మోటర్లు, కళాశాల భవనాలు ఉన్నాయి. అగ్నిమాపక సిబ్బంది కాస్త ఆలస్యం అయి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ సునీల్‌కుమార్, ఎల్ఎఫ్ రవీంద్రరెడ్డి, డీఓపీ బుజ్జిబాబు, ఎఫ్ఎం సూర్యనారాయణరెడ్డి, హెచ్‌జీలు జాన్‌కుమార్, నాయక్‌లు మంటలను ఆర్పివేశారు.


పులివెందుల నాలుగురోడ్ల కూడలిలో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన మాంసం, రోడ్డులోనే మేకలను వధ చేస్తున్న దృశ్యం

నిబంధనలు గాలికి..

- ఇష్టారాజ్యంగా మాంసం విక్రయాలు
- అటకెక్కిన ఆహార తనిఖీలు
- రోగాలపాలవుతున్న ప్రజలు

పులివెందుల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో మాంసం విక్రయాలు ఇష్టారాజ్యంగా సాగిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో మృత జీవుల మాంసాన్ని అమ్ముతున్నారు. దుకాణాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారించాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పట్టణంలో మటన్ మార్కెట్, నాలు గురోడ్ల కూడలితో పాటు జీపుల స్టాండ్లతో పాటు పలు ప్రధాన రహదారులపై మాంసం, చికెన్ దుకాణాలున్నాయి. పొట్టేళ్లు, మేకపోతు మాంసాన్ని కొందరు దుకాణదారులు రెండు మూడు రోజుల పాటు ఫ్రిజ్‌లో పెట్టి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేజీ రూ.800 పెట్టి కొను గోలు చేసినా మాంసంలో కల్తీ చేస్తున్నారని కొను గోలుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల చనిపోతున్న మేకలు, పొట్టేళ్లు, కోళ్ల మాంసాన్ని అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే రోగాలతో బాధప డుతున్న జీవాలను వధించి వాటి మాంసాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాలతో చెలగాట మాడుతున్నారు. కొంత మంది మాంసం విక్రయదారులు ఇంటి వద్దనే గొర్రెలు, మేకలు వధించి దుకాణాల్లో నేరు గా విక్రయిస్తున్నారు. దీనిపై స్థానిక మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అటకెక్కిన తనిఖీలు

నిబంధనల ప్రకారం మాంసం దుకాణదారులు మేకలను, గొర్రెలు తదితర జీవాలను కోసేటప్పుడు వాటి ఆరోగ్య పరిస్థితులను సంబంధిత అధికారి వద్ద చూపించాలి. వారి అనుమతి ముద్రతో మాంసాన్ని విక్రయించాల్సి ఉంది. మున్సిపాలిటీ, పంచాయతీల్లో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తనిఖీలు అటకెక్కాయి.

కల్తీ మాంసం విక్రయిస్తే చర్యలు



మాంసంపై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. రోడ్డుపై మురుగుకాల్వల సమీపంలో మాంసం కొనరాదు. పట్టణంలో కబేళాలు బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటాం. కల్తీ మాంసం విక్రయాలపై ఆరోగ్యవిభాగం అధికారులు దాడులు చేస్తూనే ఉన్నారు. అనధికార విక్రయాలపై దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

- రాముడు, మున్సిపల్ కమిషనరు, పులివెందుల

కారు డ్రైవర్‌పై దాడి.. చోరీ కేసులో ఇరువురు అరెస్టు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కారు డ్రైవరుపై దాడి చేసి అతని మెడలోని బంగారు గొలుసు, వెండి ఉంగరాలను లాక్కొని కారుతో సహా నిందితులు పరారయ్యారు. కారు డ్రైవరు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చిన్నచౌకు పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తన కార్యాలయంలో చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌లతో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కడపకు చెందిన నూరుల్లా అలియాస్ నూర్, తాజుద్దీన్ అలియాస్ తాజ్ హైదరబాదుకు వెళ్లి ఈనెల 15న ఇన్నోవా కారును కడపకు బాడుగకు మాట్లాడుకున్నారు. 16న కడపకు చేరుకోగానే కారు డ్రైవరు శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి కారుతో పాటు బంగారు తీసుకెళ్లాలని పథకం పన్నారు. ఇందులో భాగంగా పఠాన్ మర్షాద్ ఖాన్ అలియాస్ లడ్డూ మరో బాల నేరస్తుడితో కలిసి డ్రైవరు శ్రీకాంత్‌ను కొట్టి అతని వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, మెడలో ఉన్న బంగారు గొలుసు, వెండి ఉంగరాలు తీసుకుని కారులో పరారైనట్లు తెలిపారు. డ్రైవరు ఫిర్యాదు మేరకు సీఐ ఓబులేసు ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి నిందితులపై నిఘా ఉంచారు. అందిన సమాచారం మేరకు వాటర్ గండి రోడ్డులో కడప నకాస్‌కు చెందిన పఠాన్ అలియాస్ లడ్డుతో పాటు మరో బాల నేరస్తున్ని అరెస్టు చేసి ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా..!





గంగవరం గ్రామ సమీపంలో పెన్నా బ్రిడ్జీ వద్ద ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న కూలీలు, ఇసుక తోడేయడంతో ప్రమాదకరంగా మారిన పెన్నా బ్రిడ్జి

కమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఇసుక ప్రకృతి వరం. కానీ ఇసుకను కొందరు అక్రమ ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్న అక్రమ రవాణా ఖాజీపేట, కమలాపురం ప్రాంతాల్లో పర్యావరణ నిబంధనలు లెక్క చేయకుండా రవాణా చేస్తున్నారు. ఖాజీపేట, చాపాడు, వల్లూరు, కమలాపురం పరిసర ప్రాంతాల్లో ఈ పెన్నా, పాపాఘ్నినది పరీవాహక ప్రాంతాలున్నాయి. అయితే అధికారుల సూచనలను పక్కపెడుతూ ఇసుకను విచ్చలవిడిగా అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రివేళల్లో ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. అక్రమార్కుల మాయాజాలంలో అక్రమ ఇసుక వారికి లావాదేవీలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన రాదు. అక్రమ రవాణాపై ఆందోళన వ్యక్తం చేసిన వారి మీదనే దాడులకు దిగుతున్నారని, అసలు నేరస్థులను అణచివేసే ప్రయత్నం ఉండదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. ఇదే కొనసాగితే ఈ ప్రాంతంలో భూగర్భజలాలు అంతరించి రానున్న వేసవి కాలంలో ఈ ప్రాంతాల్లో నీటి ఎద్దడి తప్పదు.

ప్రభుత్వ విధానం నిర్వీర్యం..: ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టింది. కానీ దీన్ని నిర్వీర్యం చేసేలా అధికారుల నిర్లక్ష్యం, లంచాల వ్యవస్థ వేరే మాఫియాను తయారు చేసింది. ప్రజలకు ఉచితంగా ఇవ్వాల్సిన, నిర్మాణరంగం కోసం వినియోగించాల్సిన ఇసుకను కొందరు ఇష్టం వచ్చినట్లు రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇది కేవలం పర్యావరణ నాశనమే కాదు, ప్రజాస్వామ్యానికి ప్రమాదం.

గట్టి చర్యలు తీసుకుంటున్నాం

అక్రమ ఇసుక రవాణా నిర్మూలనకు గట్టి చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. ఎక్కువగా గంగవరం సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. అందుకు ఆ ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో గుంత కొట్టిస్తాం. అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

శివరామిరెడ్డి, తహసీల్దారు

పీ4 ద్వారా పేదరిక నిర్మూలన

టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ



పీ 4 అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా ప్రధాన వికాస్ హరిక్రిష్ణ

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పీ4 ద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ పేర్కొన్నారు. మంగళవారం 45వ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. పీ4 అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్ట్‌నర్‌షిప్ అని తద్వారా పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంపన్నులను పేదలను ఒకే తాటిపైకి తీసుకొచ్చే విధానమే పీ4 అని చెప్పారు. రాష్ట్ర సంపన్నులే కాకుండా ఎన్‌ఆర్‌ఐలు కూడా ప్రభుత్వం భాగస్వామ్యులను చేస్తున్నదని అంతటి గొప్ప ప్రోగ్రామ్‌లో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. సచివాలయ ఉద్యోగులకు డేటాను ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, 45వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రాలలో వసతులు కల్పించాలి

కడప నాగరాజుపేట, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకన కేంద్రాలలో వసతులు కల్పించాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరావు పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు శామ్యూల్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 10వ తరగతి మూల్యాంకన ప్రక్రియ ప్రారంభం అవుతున్నందున కేంద్రాలలో ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డి రమేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ అబ్దుల్ గఫార్, వైఎస్సార్ కడప జిల్లా అధ్యక్షుడు రామకృష్ణరాజు, గౌరవాధ్యక్షుడు కూరాకు రవీంద్ర, బీసీ సుబ్బరాయుడు, ఆర్థిక కార్యదర్శి చలపతిరాజు పాల్గొన్నారు.

జీఓ నెం.77ను రద్దు చేయాలి

పులివెందుల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్న జీవో నెం.77ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం నాయకులు పులివెందుల ఆర్డీవో చిన్నయ్యకు వినతిపత్రం అందించారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో చిన్నయ్య వినతిపత్రం అందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్రబాబు పాల్గొన్నారు.

విజయదుర్గాదేవి సన్నిధిలో రాహు,కేతు పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీపంలో ఉన్న విజయ దుర్గమ్మ ఆలయంలో మంగళవారం ఘనంగా రాహుకాల పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు పూజలు నిర్వహించారు. ఈనెల 30వ తేదీ ఉగాది పండుగ రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం జరుగనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, తెలిపారు.

ఇఫ్తార్ పవిత్ర కార్యం

కడప కల్చరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం వున్న ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందు అత్యంత పవిత్ర కార్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్. మాధవిరెడ్డి, మైనార్టీ నాయకుడు సలావుద్దీన్ అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా కడపజిల్లా హోటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెక్లస్ గ్లోబల్ సర్వీసెస్ అధినేత అల్లూరి సంపత్‌కుమార్ సారథ్యంలో మంగళవారం స్థానిక పెద్దదర్గా సమీపంలో ఉన్న అమీన్ ఫంక్షన్ హాలులో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు భాస్కర్, పోతుల వెంకట్రామి రెడ్డి, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

ఆసుపత్రికి వీల్‌ఛైర్ వితరణ

పులివెందుల టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి దివ్యాంగుడు జనార్ధన్ రెడ్డికి దాతలు అందించిన వీల్‌ఛైర్‌ను మంగళవారం ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ దివ్యాంగుడైన జనార్ధన్‌రెడ్డి దాతల ద్వారా ఇలా సేకరించి వీల్‌ఛైర్ వితరణ అందించడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ పవన్, ఆర్‌ఎంఓలు డాక్టర్ నవీన్, డాక్టర్ సుకన్య, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వీరాభిమాని వీరయ్య మృతి

వేంపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, ఎన్టీఆర్ వీరాభిమాని వీరయ్య అనారోగ్యంతో మరణించాడు. ఎన్టీఆర్ జయంతి, వర్ధంతి రోజున ఆయన అన్నదాన కార్యక్రమం చేసేవారు. వీరయ్య మృతిచెందిన విషయం తెలుసుకొని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కడప నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

అవినీతికి పాల్పడితే మూల్యం చెల్లించక తప్పదు : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి తెలిపారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారైన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.మంగళవారం కడప నగరం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె విలేరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మాదకద్రవ్యాల మత్తులో యువత భవిష్యత్తుపై శాసన సభలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్ర వ్యాప్తంగా మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. మాదకద్రవ్యాల మత్తులో యువత తల్లిదండ్రులపై తిరగబడేస్థాయికి దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 ముందు ఆర్టీసీలో రిటైర్డ్ అయిన సిబ్బందికి రూ.750పింఛన్ ఇస్తుంటే ఇబ్బందులు పడుతున్నారని ఈ అంశాన్ని శాసనసభలో చెప్పడం జరిగిందన్నారు. హోమియోపతి కళాశాలలో కేవలం 48 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఖాళీలు ఉన్నాయని, కనీసం వాచ్‌మెన్ కూడా లేరన్నారు. ఈ విషయాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని ఖాళీపోస్టులను భర్తీ చేస్తారన్నారు. అధికారం ఉందని అవినీతికి పాల్పడి, భూకబ్జాలకు తెగబడ్డారని, దోచుకున్నది ప్రభుత్వానికి అప్పచెప్పే విధంగా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్‌లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం

కడప మారుతీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్‌లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య అన్నారు. ఆ మేరకు ఎస్సీఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ లో సంబంధిత కలెక్టర్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కె. విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వినతిపత్రం సమర్పించిన వారిలో వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చాగలమర్రి ఓబులేసు, పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు భారవి, వేదిక జాయింట్ సెక్రటరీ వాసు, సెక్రటరీ బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, ప్రకాశ్, వంశీ తదితరులున్నారు.

రైతులకు సాయిల్ హెల్త్‌కార్డులను పంపిణీ

కమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : భూసార పరీక్ష చేసుకున్న ప్రతి రైతుకు సాయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తున్నామని ఏవో సరస్వతి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని విభరాపురం,గంగవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు వెంకట క్రిష్ణ, రైతులు పాల్గొన్నారు.

అంటువ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



అరుంధతీనగర్‌లో వైద్యాధికారి చెన్నారెడ్డితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నాగరాజు

చెన్నూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మురుగునీరు నిల్వ ఉన్న చోట, సరైన ఆరోగ్యవసతులు లేని చోట అంటువ్యాధులు సంక్రమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు అన్నారు. చెన్నూరు అరుంధతీనగర్‌ను మంగళవారం పరిశీలించారు. ఇటీవల కాలంలో కాన్సర్ ఎక్కువగా ప్రబలుతోందని ఎవరికి ఎలాంటి అనుమానాలున్నా వాటి నిర్ధారణ కోసం రిమ్స్‌కు వెళ్లి పరీక్షలు జరిగేలా చూడాలని ఆయన పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నారెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసరు డాక్టర్ రమేశ్, ఏఎంవో వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పోయిన రైతులను ఆదుకోండి

డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి

కడప కలెక్టరేట్, మార్చి 25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు, వడగండ్ల వాన, బలమైన ఈదురుగాలుల వల్ల పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండలంలో అరటి రైతులు తీవ్రంగా నష్ట పోయారని, నష్ట పరిహారాన్ని ప్రభుత్వంప్రకటించాలనీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దాదాపు 3 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, హెక్టార్‌కు రూ.40 వేలు ఇవ్వాలనీ డిమాండ్ చేశారు.

26న కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి పయనం..: ఢిల్లీలో ఈ నెల 27 వ తేదీన ఇందిరా భవన్‌లో జరిగే సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతితో పాటు మరి కొందరు నేతలు కడప నుంచి 26 వ తేదీన బయలు దేరి వెళ్లనున్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ మేషక్‌బాబు



రక్తదానం చేస్తున్న మేషక్‌బాబు

కడప క్రైం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న ఓ వ్యక్తికి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు పోలీసుకానిస్టేబుల్ మేషక్‌బాబు. కడప నగరం ఎర్రముక్కపల్లెకి చెందిన డయాలసిస్ చేయించుకుంటున్న విజయ్‌బాబు అనే వ్యక్తికి అత్యవసరంగా ఏబీ పాజిటివ్ బ్లడ్ గ్రూపు రక్తం అత్యవసరమని నగరంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్ వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసు కళాజాగృతి బృందం కానిస్టేబుల్ మేషక్‌బాబు వెంటనే స్పందించి రక్తదానం చేసి ప్రాణాపాయం నుంచి తప్పించారు. డయాలసిస్ పేషంటు కుటుంబ సభ్యులు మేషాక్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేసిన మేషాక్‌బాబును పోలీసు అధికారులు అభినందించారు.

ఇంధన ఆదా బాధ్యతగా గుర్తించాలి

కడప మారుతీనగర్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో పనిచేసే ప్రతీ డ్రైవర్ ఇంధన పొదుపును బాధ్యతగా గుర్తెరిగి విధులు నిర్వహించాలని డిప్యూటీ సీఎంఈ లక్ష్మీభాస్కర్ సూచించారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ ఆర్.ఎం. కార్యాలయ సభా భవనంలో ఇంధన పొదుపు చేయడంలో నిర్లక్ష్యం వహించే డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు డిపో మేనేజర్ శ్రీరామ్‌కుమార్, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

తోపుడుబండ్ల కార్మికులతో డబ్బులు వసూలు చేయడం అన్యాయం

కడప సెవెన్ రోడ్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో తోపుడుబండ్ల కార్మికులతో బలవంతంగా డబ్బులు వసూలు చేయడం సరైంది కాదని సీఐటీయూ నగర అధ్యక్ష కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య, పి.చంద్రారెడ్డి సంయుక్త ప్రకటనలో తెలిపారు. తోపుడుబండ్ల కార్మికులు చాలీచాలని దినకూలీతో కాలం గడుపుతున్నారని తెలిపారు. అలాగే కార్పొరేషన్ అధికారులు వారిని ఆదుకోవాలని కోరారు. తోపుడుబండ్ల కార్మికులతో డబ్బులు వసూలు చేసిన వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చక్కని జీవనశైలితో అనారోగ్యాలకు దూరం

కడప ఎడ్యుకేషన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): సరైన జీవనశైలిని అనుసరిస్తే మహిళలు అనారోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చని గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్విని పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఉమెన్ సెల్, వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్ 9, పల్లా హాస్పిటల్ కడప వారి సహకారంతో అన్నమాచార్య సెనెట్ హాల్‌లో గైనకాలజికల్ సమస్యలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ ప్రారంభించగా, ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి సభా అధ్యక్షతన వహించారు. డాక్టర్ తేజశ్విని స్త్రీలలో సాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యల పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం వైద్యులు నరేష్‌కుమార్‌రెడ్డి, ఉమెన్‌సెల్ డైరెక్టర్స్ మాధవి, విజయలక్ష్మి, అనుప్రసన్న, బిందు, శ్రీనివాసరావు, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తొలగించారు...తగిలించడం మరిచారు



అసౌకర్యంగా ఉన్న సిమెంట్ బెంచీలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పనుల కోసం కలెక్టరేట్‌లోని కార్యాల యాలకు వచ్చే ప్రజలు కూర్చునేందుకు వీలుగా పలువురు దాతలు సిమెంటుతో తయారుచేసిన బెంచ్‌లు ఏర్పాటుచేశారు. కలెక్టర్ కార్యాలయం వద్దనే కాకుండా వివిధ శాఖలకు సంబంధించిన కార్యాలయాల వద్ద ఈ బెంచీలను ఏర్పాటుచేశారు. అయితే ఆ బెంచీలకు తమ పేర్లు రాయించుకోవడం జరిగింది. 2024లో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉందనే కారణంతో అధికార యంత్రాంగం దృష్టి పలకలపై పడింది. ఇందులో రాజకీయ నాయకుల పేర్లు కూడా ఉండడం వల్ల ఆ పేర్లు ఉన్న పలకలను తొలగించారు. అయితే ఎన్నికల ప్రక్రియ పూర్తై దాదాపు పది నెలల కాలం నడుస్తోంది. కానీ అధికారులు తొలగించిన ఆ పలకలను తిరిగి ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

పేపర్ లీకేజీ పై సమగ్ర విచారణ జరిపించాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వల్లూరు, వేంపల్లెలో పదో తరగతి పరీక్షల మ్యాథ్స్ పేపర్ లీకేజీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల, శివకుమార్ తెలిపారు. మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం ఇచ్చారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి



కొక్కిరాయపల్లెలో ఉపాధి కూలీల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సికేదిన్నె, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. మండలంలోని కమ్మవారిపల్లెలో మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉదయం 6 గంటల నుంచి 11 గంటలలోపు పనులు ముగించుకోవాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పనులు త్వరగా పూర్తి చేసుకుని వడదెబ్బకు గురికాకుండా కూలీలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామాంజనేయులరెడ్డి, ఈవోఆర్డీ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు..: ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు అన్నారు. మండలంలోని కొక్కిరాయపల్లె గ్రామంలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించారు. వేసవిలో ప్రతి కూలీకి అదనపు మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తుందని అలాగే వడదెబ్బ తగలకుండా కూలీలు పనిచేసే ప్రాంతంలో నీరు, షామియాన లాంటివి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పనిచేసే సమయంలో ఎవరికి అసౌకర్యం కలిగినా వెంటనే నీడ ప్రాంతానికి రావాలని ఆయన సూచించారు. వడదెబ్బ తగలకుండా తరచూ ఓఆర్ఎస్ తాగడం, మంచినీళ్లు, మజ్జిగ తాగడం చేయాలన్నారు. కాగా ఈవోఆర్డీ సురేశ్‌బాబు మండలంలోని గుర్రంపాడు పంచాయతీలో గల ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. వానపాములతో తయారయ్యే ఎరువు కోసం వానపాములు వదలడం జరిగింది.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్

కమలాపురం రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ప్రజలందరూ వడదెబ్బ తగలకుండా ఉండేందుకు శీతలంగా ఉండే ప్రదేశాల్లో ఉండాలన్నారు. వేడిగా ఉన్న రోజుల్లో తప్పనిసరిగా గొడుగు వాడాలన్నారు. తెలుపు రంగు దూదితో వేయబడిన పలుచటి వస్త్రాలను ధరించాలని, తలకు టోపీ లేదా రుమాలు పెట్టుకోవాలన్నారు. దాహం ఉన్నా లేకున్నా ఉప్పు కలిపిన నీరు తాగాలన్నారు.వడదెబ్బకు గురైన వారిని శీతల ప్రాంతానికి చేర్చాలన్నారు. వెంటనే దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మసీదులో మంగళవారం రాత్రి ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ,భూపేశ్ రెడ్డి ఆయన కుటుంబసభ్యులు ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయ ణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, బాబురెడ్డి, శంకర్‌రెడ్డి, ఇందిరమ్మ, గోరుశెట్టిబాబు, డీలర్‌భాషా పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చాపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చాపాడులోని కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కోసం బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో రవిశంకర్ కోరారు. వచ్చే నెల 11వ తేదీ వరకు 6వ తరగతి నుంచి జూనియర్ ఇంటర్ వరకు అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులు ఉన్నాయన్నాయన్నారు. తల్లిదండ్రులు లేని బాలికలు, దివ్యాంగులు, ఈబీసీలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బి.కోడూరులో : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పథక సంచాలకుల వారి ఆదేశాలమేరకు ఆరోతరగతి, ఇంటర్ ప్రవేశానికి అలాగే 7, 8 , 9 , 10 , 12 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం మండల పరిధిలోని కస్తూర్బా పాఠశాలలో ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో సునీల్‌కుమార్ తెలిపారు. అలాగే అనాథలు, గుడి బయట పిల్లలు, బడి మాని వేసిన పిల్లలు, షెడ్యూలు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల వారు, అలాగే మైనారీలు ఆర్థికంగా వెనుకబడ్డవారు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టండి

దువ్వూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిధిలో పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని జమ్మలమడుగు డివిజన్ గ్రామ పంచాయతీల అధికారి తిమ్మక్క తెలిపారు. దువ్వూరు, సంజీవరెడ్డిపల్లె పంచాయతీల్లో మంగళవారం ఆమె పర్యటించి పారిశుధ్యం పరిశీలించారు. పైపులైను లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. పన్ను వసూళ్ల గురించి ఆరా తీశారు. అనంతరం దువ్వూరు గ్రామ పంచాయతీ సచివాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈవోపీఆర్డీ హరికృష్ణయాదవ్ పాల్గొన్నారు.

2న మండల సమావేశం

బ్రహ్మంగారిమఠం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 2వతేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. మండల పరిషత్ సభాభవనంలో 2వతేదీ ఉదయం 10గంటలకు సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

శేషారెడ్డిపల్లెలో తాగునీటి కష్టాలు

జమ్మలమడుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని శేషారెడ్డిపల్లె గ్రామం (రాళ్లగుండ్లకుంట)లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. మూడు రోజుల నుంచి గ్రామంలో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్కరు పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. శేషారెడ్డిపల్లె గ్రామంలో మూడు రోజుల నుంచి కరెంటులేక బోరు పని చేయకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయని స్థానికులు తెలిపారు. గ్రామంలో విద్యుత్తు లేక తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు. తాగునీటి కోసం చేసేది లేక గ్రామ శివార్లలో పైపుల లీకేజీ గుంతల వద్ద నిలిచిన నీటిని బిందెలకు తోడి తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి నీరుతాగితే రోగాలు వస్తే ఎవరు కాపాడుతారని పేర్కొంటున్నారు. మరికొందరు పురాతన బావిలో నుంచి నీళ్లను తెచ్చుకుంటున్నారు. ఇంకొందరు శేషారెడ్డిపల్లె వద్ద నుంచి సుమారు అయిదు కిలోమీటర్ల దూరం పట్టణంలోకి ప్రవేశించి ఫిల్టర్‌వాటర్ స్కూటర్‌లో తెచ్చుకుంటున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ సమస్యకు సంబంధించి శేషారెడ్డిపల్లె గ్రామ సర్పంచ్ అధికారుల వద్దకు వెళ్లి సమస్య తెలిపినా అధికారులు రాలేదని గ్రామస్థులు చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



బావి నుంచి నీళ్లను చేదుతున్న గ్రామస్థులు

విద్యుత్ సమస్య కాదు

కాగా శేషారెడ్డిపల్లెలో విద్యుత్ సమస్య వల్ల తాగునీటి సమస్య కాదని విద్యుత్ రూరల్ ఏఈ ఈశ్వరయ్య తెలిపారు. గ్రామంలో మోటారు సమస్య వల్లే నీటి సమస్య ఉండి ఉండవచ్చని ఆయన అన్నారు. నీటి సమస్యపై ఏఈని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పైవిధంగా స్పందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు , మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్‌లో ఉన్న యూనిఫాం దుస్తులను చీరలను పంపిణీ చేశారు. మంగళవారం కమిషనర్ మల్లికార్జున ఆధ్వర్యంలో కార్మికులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెగ్యులర్ ఔట్ సోర్సింగ్ కార్మికులు 329 మందికి రూ.12.50 లక్షల విలువ చేసే యూనిఫాం దుస్తులు చీరలు టవళ్ళు అందజేశామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సాల్మన్, విజయ్‌కుమార్, ప్రమీల గుర్రమ్మలు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు, దుస్తులు వితరణ



కాశినాయన మార్చి25 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలంలోని బాలమ్మ సత్రంకు మంగళవారం ఖమ్మంకు చెందిన షేర్‌డి విషన్ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్ నారాయణ రూ.2 లక్షల విలువ గల నిత్యావసర సరుకులను అందజేశారు. ఆశ్రమంలో ఉన్న దాదాపు 80 మంది మతిస్థిమితం కోల్పోయిన వారికి 3 నెలలకు సరిపడు బియ్యం, కందిపప్పు వంటసామగ్రి,కూలర్‌లు, ఫ్యాన్‌లు, దుస్తులు, దుప్పట్లు, ఇతర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దారు వెంకటసుబ్బయ్య షేర్‌డి విషన్ సంస్థ సేవల ను కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయుడు జోజ య్య, సంస్థ ప్రతినిధులు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

109 మందికి వైద్యపరీక్షలు

పోరుమామిళ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వికలత్వ పింఛను పొందుతున్న 109 మంది పింఛనుదారులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమణారెడ్డి తెలిపారు. మండలంలోని 17 పంచాయతీలకు చెందిన వివిధ రకాల వికలత్వ పింఛను పొందుతున్న లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు అందించామన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం నిర్దేశించిన ఆసుపత్రుల్లో వారు హాజరు కావాలని తెలిపారు. తదుపరి ఉన్నతాధికారులు వాటిపై చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

రెండు వాహనాలు ఢీ: డ్రైవర్‌కు గాయాలు

ముద్దనూరు మార్చి25(ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని మంగపట్నం గ్రామ సమీపంలో మంగళవారం లారీ, బొలెరో వాహనం ఢీకొనడంతో బొలెరో వాహనం డ్రైవర్ రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఎర్రగుంట పల్లెకు చెందిన డ్రైవర్ రాజేష్ బొలెరో ట్యాంపర్ వాహనంలో తాడిపత్రి వైపు నుంచి కరివేపాకు లోడు తీసుకొని వస్తుండగా ఎదురుగా లారీ వచ్చి ఢీకొంది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

బద్వేలుటౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలుసమస్యలపై బుధవారం టీడీపీ కార్యాలయంలో వినతులు స్వీకరించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డిలు పేర్కొన్నారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజే యవచ్చని ఉదయం 9గంటల నుంచి ప్రజా సమస్యలపై పార్టీ కార్యాలయంలో చర్చించి పరిష్కారం చేస్తామన్నారు. ఇక నుంచి ప్రతి బుధవా రం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించి వాటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

పండ్లతోనే వేసవిలో ఆరోగ్యం పదిలం

మైలవరం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటున్న దృష్ట్యా శరీరం డీహైడ్రేషన్‌తో ఆరోగ్యం దెబ్బతినకుండా ఉండటానికి తాజా పండ్లు ఎంతగానో దోహదపడుతాయని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ పి.సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వేపరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఫ్రూట్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా గణాంకాల అధికారి రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపవరం 1వ సచివాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ మహిళ గర్భవతిగా నమోదు అయినప్పటి నుంచి అవగాహన కల్పిస్తూ మెరుగైన సేవలు అందించాలన్నారు. కామనూరు సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, డీపీఎం యు.నారాయణ, ఏఎస్‌వో జాకబ్, డీపీహెచ్ ఎన్.శాంతిలత, సీహెచ్‌వో క్రిష్ణమ్మ, సూపర్‌వైజర్లు అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

సర్పంచ్‌లంటే నిర్లక్ష్యమెందుకు?

● మండల సమావేశంలో పలువురు సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడీవో వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులకు సర్పంచులన్నా, గ్రామపంచాయతీలన్నా విలువేలేదని, చాలా చులకనగా చూస్తున్నారని వై.కోడూరు సర్పంచి కొత్తపు వాసుదేవరెడ్డితోపాటు పలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఎర్రగుంట్ల మండల సర్వసభ్య సమా వేశంలో ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వై.కోడూరు సర్పంచి కొత్తపు వాసుదేవరెడ్డి అధికారుల నిర్లక్ష్యధోరణి, తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేకి 96ఎకరాల ప్రభుత్వ భూమిని మెగా కంపనీకి రెవెన్యూ అధికారులు అప్పనంగా కట్టబెట్టారని ఆరోపించారు. గ్రామాల్లో నీటి సరఫరా విషయంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య అధికారులను ప్రజాప్రతినిధులను కోరారు. విద్యుత్ అధికారులు సక్రమంగా పనిచేయాలని ఉపమండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి కోరారు. వీఆర్‌ఏలు గ్రామంలో ఉండకపోతే ఎలా అని ప్రశ్నించారు. వెలుగు ద్వారా మహిళలకు స్త్రీనిధి కింద రుణాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

క్యూబా దేశానికి సహాయం చేయండి

పోరుమామిళ్ల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : క్యూబా దేశానికి సహాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన క్యూబా దేశానికి ఆర్థికంగా సహాయం చేయాలని కోరుతూ పోరుమామిళ్లలో సీఐటీయూ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రతి మండల స్థాయి గ్రామీణ స్థాయి నుంచి విరాళాలు సేకరించి క్యూబా దేశానికి పంపాలని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ప్రజల నుంచి రూ.2300 విరాళాలు వచ్చాయని ఇది క్యూబాకు పంపిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

చాపాడు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో సీబీఐటీ కాలేజీకి చెందిన కేతిరెడ్డి నాగయశ్వంత్‌రెడ్డి అనే విద్యార్థి తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. అతని ఎడమకాలు విరిగినట్లు తెలిపారు. యశ్వంత్‌రెడ్డి బైక్‌పై రోడ్డు దాటుతుండగా మైదుకూరు నుంచి ప్రొద్దుటూరువైపు వెళుతున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. చికిత్స కోసం అతనిని ప్రొద్దుటూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బుకీల కోసం పోలీసుల గాలింపు

ప్రొద్దుటూరు , మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టడంలో బాగంగా క్రికెట్ బుకీల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఇటీవల ఒన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసిన వైసీపీ నాయకుడు రావులకొల్లు నాగేంద్రను విచారించిన క్రమంలో మట్టి మసీదు వీధికి చెందిన ఒక బడా క్రికెట్‌బుకీకి అందులో పాత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మట్టి మసీదుకు చెందిన ఈ క్రికెట్ బుకీతో పాటు నెల్లూరు ,అనంతపురం జిల్లాలకు చెందిన మరికొంతమంది క్రికెట్ బుకీలను పట్టుకునే వేటలో ఒన్‌టౌన్ పోలీసులు ఉన్నారు.. గతంలో ఈ క్రికెట్ బుకీలపై ఉన్న పాత కేసుల ఆధారంగా వారిని త్వరలో అదుపులోకి తీసుకోకున్నట్లు సమాచారం.

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక

కొండాపురం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ అసోషియేషన్ ఆదేశానుగుణంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా అనిమేష్, ఉపాధ్యక్షులుగా రవీంద్రనాథ్‌రెడ్డి, రాంబాబు, మహిళా అధ్యక్షురాలుగా సువర్ణ, కోశాధికారిగా రంగనాయకులు, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, అదనపు సెక్రటరీలుగా భరత్‌కుమార్ , శివారెడ్డిలను ఎన్నుకున్నారు. అదేవిధంగా గౌరవ సలహాదారులు, కార్యనిర్వాహక సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వారి నియామక పత్రాన్ని ఎంపీడీవో నాగప్రసాద్‌కు అందజేశారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఎర్రగుంట్ల, మార్చి 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ వికాస్ సేవా సంఘం ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామగ్రిని హెచ్‌ఎం వసుంధర చేతులమీదుగా మంగళవారం పంపిణీ చేసినట్లు సంఘం అధ్యక్షుడు కే.వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. సేవా సంఘంకు చెందిన కస్తూరి ఆర్థిక సహకారంతో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 290 మందికి సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు.

28న బస్టాండు, జంతువధశాలకు వేలం

ముద్దనూరు మార్చి25(ఆంధ్రజ్యోతి):స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీన 2025-26 సంవత్సరంకు గాను బస్టాండు , జంతువధశాల గేటు వసూళ్లకు సంబంధించి బహిరంగా వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈవో నరసింహులు తెలిపారు.వేలం పాటలో పాల్గొనదలచినవారు బస్టాండు కు రూ.4లక్షలు, జంతువధశాలకు రూ.40వేలు డిపాజిట్టు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఈవో తెలిపారు.

చిన్నారుల సంక్షేమానికే అంగన్‌వాడీలకు శిక్షణ

బ్రహ్మంగారిమఠం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల జ్ఞాపకశక్తి పెంపుదల పై మానసిక, శారీరక అభివృద్ధిపై మంగళవారం బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలరే శిక్షణ తరగతులు నిర్వహించినట్లు స్త్రీశిశుసంక్షేమశాఖ సీడీపీవో సావిత్రమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాబోవు రోజుల్లో అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నపిల్లల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శారద, ప్రత్యూష, వరలక్ష్మీతో పాటు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రారంభమైన నారాయణస్వామి ఆరాధనోత్సవాలు

బ్రహ్మంగారిమఠం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలంలోని అవధూత నారాయణస్వామి 111వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే 26వతేదీ ఘనంగా స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అంబేడ్కర్‌నగర్‌లో పర్యటించిన ఆర్డీవో, కమిషనర్

బద్వేలు, మార్చి 25 (ఆంధ్ర జ్యోతి): బద్వేలు పురపాలక సంఘం పరిధిలోని అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం ఆర్డీవో చంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి లతో పాటుగోపవరం తహశీల్దారు త్రిభువన్ రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ అనధికార ఆక్రమణ స్థలాలలోని ఇండ్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలని వారు వివరించారు.

వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి



గండికోట జలాశయంలోని నీటి సరఫరా మోటారును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

కొండాపురం/ముద్దనూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జడ్పీ సీఈవో ఓబుళమ్మ అధికారులను ఆదేశించారు. గండికోట ప్రాజెక్టు వద్ద సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌ను, పంప్‌హౌస్‌ను, అందులోని మోటర్‌లను మంగళవారం పరిశీలించారు. చిన్నచిన్న మరమ్మతులు వస్తే పంచాయతీ నిధుల నుంచి వాడుకోవాలని కార్యదర్శులకు సూచించారు. పెద్దసమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావా లని తెలిపారు. పైపులైన్ ద్వారా లీకేజీలు లేకుండా చూడాలని అధికా రులను కోరారు. పలు గ్రామాలకు నీరు అందించే సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీమ్ ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొండాపురం, ముద్దనూరు ఎంపీడీవోలు నాగప్రసాద్, ముకుందరెడ్డి, కాంట్రాక్టర్ గండ్లూరు శంకర్‌రెడ్డి ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ముద్దనూరు మండలంలో తాగునీరు, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు.టౌన్‌లోని తాగు నీటి సంపును, ట్యాంకును అలాగే ముద్దనూరు మండలానికి సంబంధించి గండికోట జలాశయం వద్ద నున్న సీపీడబ్ల్యూఎస్ పథకాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. తరువాత ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందారెడ్డి, సీఈవో టెక్నీకల్ అడ్వైజర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఈవోపీఆర్డీ వీరభద్రుడు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్, ఏఈ హరీష్ ఈవో నరసింహులు, సచివాలయాలు సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ వేలం ద్వారా రూ.1.60కోట్లు ఆదాయం



మార్కెట్‌లీజుకు వేలం నిర్వహిస్తున్న కమిషనర్

ప్రొద్దుటూరు , మార్చి 25 (ఆంధ్రజ్యోతి) :ప్రొద్దుటూరు మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్ లీజుకు వేలం పాటలు నిర్వహించగా రూ. 1,60,80,000 ఆదాయం వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ వి. మల్లికార్జున తెలిపారు. మంగళవారం మున్సిపల్ సభాభవనంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ లీజుకు వేలం పాటలు నిర్వహించారు. ఇందులో రూ. 1,60,80,000 అత్యధికంగా షేక్ ముత్యాల పాటి గౌస్‌బాషా వేలం పాట పాడి మార్కెట్‌లీజు దక్కించుకున్నారు. రెండవ పాటదారుడు చింతకుంట నిజాముద్దీన్ రూ.1,60,70,000 పాట పాడగా, మూడవ పాటాదారుడు కతాల్ సాబ్ గారి జమీలా రూ.1,52,10,000పాట పాడారు. గత ఏడాది 2023-24 ఆర్థిక సంవత్సరం 1,28,00,000 లీజు వేలం పాడగా నేడు రూ.27,01 లక్షలు అదనంగా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చింది. 18 శాతం జీఎస్‌టీ, 2 శాతం పారిశుధ్య సెస్ అదనంగా మున్సిపాలిటీకి కాంట్రాక్టరు చెల్లించాల్సిఉంది. ఈ వేలం పాటలను మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు. ఆర్‌ఐ శివచరణ్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

బద్వేలు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ఇంటి పన్ను ఖాళీ స్థలాలపై సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి మంగళవారం పేర్కొన్నారు. మొదటి అర్థ సంవత్సరానికి జూన్ నెలా ఖరులోపు, రెండవ అర్థ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్నులు చెల్లించాలని కోరారు. ఆ విధంగా పన్నులు చెల్లించకుంటే 2శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు. మున్సిపాలిటీలో పేరుకుపోయిన పన్ను బకాయిలు ఈ నెల 31వ తేదీలోపు ఏక కాలంలో చెల్లించినట్లయితే వారికి వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఉన్న బకాయిలను ఇప్పటికే కట్టిన వారికి రాబోయే ఆర్థిక సంవత్సరం పన్నులకు 50 శాతం వర్తిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ షేక్ మెహరూన్

● కౌన్సిల్లో మెజారిటీ దిశగా పావులుకదుపుతున్న టీడీపీ



వైసీపీ కౌన్సిలరుకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు , మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నుంచి టీడీపీకి మళ్లీ వలస బాట మొదలైంది. మంగళవారం వైసీపీ 25 వవార్డు కౌన్సిలర్ షేక్ మెహరూన్ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కౌన్సిలర్ షేక్ మెహరూన్ తోపాటు మైనారిటీ నాయకుడు నూరి మరికొంతమంది టీడీపీలో చేరారు. వారందరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఆయన బావమరిది బంగారురెడ్డిలు ఎన్ని జిమ్మిక్కులుచేసినా వైసీపీని నమ్మరన్నారు. వైసీపీ ఖాళీ కావడం ఖాయమన్నారు. ఇప్పటికే 14మంది టీడీపీలో చేరగా మెహరూన్‌తో కలిపి 15 మంది కానున్నారు. కాంగ్రెస్ జనసేనల తరుపున ఇర్ఫాన్ మహ్మద్ గౌస్‌లు కూడా టీడీపీకి మద్దతుగా ఉన్నారు. దీంతో వారి బలం ప్రస్తుతం 17మంది వున్నారు. మరో నలుగురు వైసీపీ కౌన్సిల్లర్లు టీడీపీలోకి రావడానికి సిద్దంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఈవీ సుదాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జబివుల్లా, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ఆది సమక్షంలో పలువురు కూటమిలో చేరిక



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి సమక్షంలో కూటమిలో చేరినవారు

జమ్మలమడుగు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సమక్షంలో పలువురు కూటమిలో చేరారు. మైలవరం మండలం ఎంపీపీ భర్త చెన్నకేశవరెడ్డి చిన్నవెంతుర్ల గ్రామం, అలాగే ఎం.కంబాలదిన్నెప్ ఎంపీటీసీ బాలకొండయ్య బెస్తవేముల ఉప సర్పంచ్ రామయ్య, మౌలాలిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, మల్లయ్య కూటమి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ సాధికారిక నమోదు, సభ్యత్వ కార్డుల పంపిణీపై అవగాహన కల్పించామన్నారు.

బీసీలను మోసం చేయడం రాచమల్లుకు తగదు



మాట్లాడుతున్న బీసీ నేతలు

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): గోపవరం ఉపసర్పంచ్ పదవిని రెండున్నర సంవత్సరాలు బీసీలకు కేటాయిస్తానని హామీ ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే రాచమల్లు నేడు మోసం చేయడం తగదని గోపవరం పంచాయతీ నాయకులు విమర్శించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ పదవిని రెండున్నర సంవత్సరాలు ఓసీలకు, రెండున్నర సంవత్సరాలు బీసీలకు ఇస్తానని రాచమల్లు హామీ ఇచ్చారన్నారు. 27న ఉపసర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడిందని, తమ కోడలు రమాదేవిని అభ్యర్థిగా ప్రకటించాలని కోరితే మాజీ ఎమ్మెల్యే స్పందించడంలేదన్నారు. రాఘవేంద్రారెడ్డిని మరోసారి ఉపసర్పంచ్‌గా ఎంపిక చేయడానికి మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. సమావేశంలో బీసీ నేత కొండడయ్యతో పాటు వార్డు సభ్యులు ఆదినారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ ఓబుళరెడ్డి, మధు, వెంకటరాముడు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోండి

పెద్దముడియం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలోని రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దారు బాల నర సింహులు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఈకేవైసీ పూర్తి కాని రేషన్‌కార్డుదారులందరూ ఆయా గ్రామాల్లో మీ సమీప చౌక దుకాణాల్లో ఈకేవైసీ వెంటనే పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. లబ్ధిదారులు రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి అక్కడ పెండింగు ఉన్న జాబితాలో వివరాలు చూసుకుని ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలన్నారు. ఒకవేళ దూర ప్రాంతాల్లో ఉన్న వారు, ఉద్యోగం చదువు రీత్యా ఇతర కారణాలతో అందుబాటులో లేని వారు ఆయా ప్రాంతాల్లో చౌక దుకాణాల డీలర్ల వద్దకు వెళ్లి సదరు రేషన్‌కార్డులకు ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దారు పేర్కొన్నారు.